క్లుప్తంగా

క్రీడా దుస్తులు అందజేత



దుస్తులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మఠంపల్లి : మండలంలోని అల్లీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2015– 16 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆ పాఠశాలలోని వాలీబాల్, ఖోఖో క్రీడాకారులకు రూ.10 వేల విలువ గల క్రీడా దుస్తులను హెచ్ఎం చిరంజీవికి అందజేశారు. ఉపాధ్యాయులు సుధాకర్, నాగేశ్వరరావు, నూర్జహాన్, నాగవాసిని, పీఈటీ మైసయ్య గౌడ్, పూర్వ విద్యార్థులు దివ్య, అనీల్, అలేఖ్య, మధు, కాశీ, గోపి,పవన్ కుమార్, అమీర్ విద్యార్థులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్, మెన్స్ ఫిజిక్ పోటీల్లో బహుమతులు



షీల్డ్, ప్రశంసాపత్రంతో సంజయ్

హుజూర్‌నగర్ : హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో గల ఎంఆర్ స్పోర్ట్స్‌లో జరిగిన క్లాసిక్ ఇండియా –2023 బాడీ బిల్డింగ్, మెన్స్ ఫిజిక్ పోటీలలో హుజూర్‌నగర్‌లోని నేషనల్ జిమ్‌కు చెందిన జీవానందం సంజయ్‌కి బహుమతులు లభించాయి. మెన్స్ ఫిజిక్‌లో ద్వితీయ బహుమతి, రూ.10 వేల నగదు, మెడల్, ధృవపత్రం, షీల్డ్, బాడీ బిల్డింగ్‌లో తృతీయ బహుమతి, రూ.5 వేల నగదు, మెడల్, ధ్రువపత్రం షీల్డ్ లభించి నట్లు కోచ్ రవి సోమవారం తెలిపారు.

‘ఆయుష్మాన్ భారత్’పై అవగాహన

హుజూర్‌నగర్ : ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్యమిత్రలు నరసింహారావు, ప్రసాద్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకంపై అవగాహన కల్పించారు. పాఠశాల ఇన్‌చార్జ్ నందనాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యాధికారమే బీఎస్పీ లక్ష్యం

గరిడేపల్లి : బహుజన రాజ్యాధికారమే బీఎస్పీ లక్ష్యమని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని తాళ్లమల్కాపురం, రేగులగడ్డతండాల్లో జరిగిన బూత్ కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం బూత్ కమిటీలు ఎన్నుకున్నారు. అలాగే తాళ్లమల్కాపురంనకు చెందిన యశ్వంత్, కోట గోపి, అశోక్, లోకేష్, అబ్రహం , లోకేష్, వీరస్వామిలతో పాటు రేగులగడ్డకు చెందిన పలువురు బీఎస్పీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో భాను, ప్రకాశ్, శివ, రాము, సిపాయి, వెంకటేష్, కిరణ్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

‘చలో హైదరాబాద్’ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కామళ్ల నవీన్, సిబ్బంది

మునగాల : కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో పని చేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్ డిమాండ్ చేశారు. కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్, ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపు మేరకు మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించబోయే మహాధర్నా పోస్టర్‌ను మంగళవారం మునగాలలోని కేజీబీవీలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేజీబీవీ బోధనేతర సిబ్బంది శశికళ, నాగమణి, రజిత, మాధవి, పార్వతి, నాగమణి, సుజాత, ధనలక్ష్మి, మౌనిక, ఎం.సరోజిని, మంగమ్మ పాల్గొన్నారు.

కార్యనిర్వాహక కార్యదర్శిగా నాగేశ్వరరావు ఎన్నిక

హుజూర్‌నగర్ : మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా హుజూర్‌నగర్‌కు చెందిన కోల నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయనకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్లేపల్లి వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు తుమ్మగోటి కార్తీక్, మహేందర్ నాయుడు, రాము, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.వంద నాణెం విడుదల హర్షణీయం

మునగాల : మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు పేరు మీద సోమవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము రూ.వంద నాణెం విడుదల చేయడం హర్షణీయమని సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగువారి జాతిని దశదిశలా వ్యాపింపచేసిన మహానుభావుడు, బడుగు, బలహీన వర్గాలకు ఎన్నో పథకాలు అందించి, అణగారిన వర్గాలకు ఎన్నో పదవులను కట్టబెట్టిన గొప్ప రాజకీయవేత్త ఎన్‌టీఆర్ అని కొనియాడారు.

న్యాక్ శిక్షణతో స్వయం ఉపాధి

- భవన నిర్మాణం, కుట్టుమిషన్‌పై గ్రామీణ ప్రజలకు తర్ఫీదు
- భోజన వసతితో పాటు రోజుకు రూ.300 భత్యం
- లేబర్ కార్డున్న వారే అర్హులు



అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్న నిర్వాహకులు

నడిగూడెం : మండల పరిధిలోని చెన్నకేశ్వాపురం, రత్నవరం గ్రామాల్లో న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) ఆధ్వర్యంలో భవన నిర్మాణంపై గత కొద్ది రోజులుగా ఉచితంగా వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌కు 15 రోజుల చొప్పున 30 మందికి శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పొందే అభ్యర్థులకు అవసరమైన దుస్తులు, పరికరాలతో శిక్షణ పూర్తి అయ్యాక ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారు. ఇప్పటివరకు చెన్నకేశ్వాపురంలో రెండు బ్యాచ్‌లకు భవన నిర్మాణంపై, ఒక బ్యాచ్ మహిళలకు టైలరింగ్‌పై ఇచ్చారు. ప్రస్తుతం రత్నవరం గ్రామంలో భవన నిర్మాణంపై వృత్తి నైపుణ్య శిక్షణ కొనసాగుతోంది. ఈ శిక్షణను గ్రామ పంచాయతీ కార్యాలయాల ఆవరణల్లో నిర్వహిస్తున్నారు. శిక్షణ పొందే అభ్యర్థులకు భోజన వసతి కల్పిస్తూ రోజుకు రూ.300ల చొప్పున భత్యం కూడా అందజేస్తున్నారు. ఈ ప్రత్యేక వృత్తి నైపుణ్య శిక్షణను నడిగూడెం, మునగాల, మోతె, అనంతగిరి మండలాలకు చెందిన లేబర్ కార్డులున్న అభ్యర్థులు, యువతీ, యువకులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ శిక్షణ ద్వారా గ్రామీణ ప్రాంతాల యువత స్వయం ఉపాధి పొందుతున్నారు.

శిక్షణ చాలా బాగుంది



రత్నవరం గ్రామంలో భవన నిర్మాణంపై ఇస్తున్న ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణ తీసుకుంటున్నాను. శిక్షణ చాలా బాగుంది. భవన నిర్మాణ పనులకు అవసరమైన సాంకేతిక అంశాలపై శిక్షణతో మంచి అవగాహన వస్తున్నది. నిర్మాణంలో మెళకువలు నేర్చుకుంటున్నాను.

– గుండ్లపల్లి బుచ్చిరాములు, సిరిపురం

ఉపయోగకరంగా ఉంది



మా గ్రామంలో భవన నిర్మాణ పనులపై ఇస్తున్న శిక్షణ ఉపయోగకరంగా ఉంది. గోడలు కట్టడం, ఇసుక, సిమెంట్ మిశ్రమం కొలతలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ ప్రత్యేక శిక్షణతో మాకు నిత్యం ఉపాధి లభించే అవకాశముంది.

– ఉప్పుతోళ్ల శ్రీనివాస్, రత్నవరం

మూడు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చాం



చెన్నకేశ్వాపురం, రత్నవరంలలో యువతకు వృత్తి నైపుణ్యంపై ఇప్పటివరకు మూడు బ్యాచ్‌లకు టైలరింగ్, భవన నిర్మాణంపై శిక్షణ ఇచ్చాం. లేబర్ కార్డులున్న వారికి శిక్షణ ఇస్తున్నాం. శిక్షణకు వచ్చే అభ్యర్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నాం.

– కరుణసాగర్, శిక్షకుడు

బీఆర్‌ఎస్ పార్టీతో గ్రామాలు అభివృద్ధి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



బేతవోలులో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

చిలుకూరు : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని బేతవోలు గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.8 లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 లక్షలు, ఐసీడీఎస్ నిధులు రూ.2 లక్షల చొప్పున ఒక్కో భవనానికి రూ.12 లక్షలతో చేపట్టిన ఐదు అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. భవనాలను నాణ్యవంతంగా సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ వట్టికూటి చంద్రకళ నాగయ్య, మాజీ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ నెమ్మాది సైదాబాబు, సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్లు బాషం సైదులు, జానకీరామాచారి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, పీఆర్‌ఏఈ లక్ష్మారెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ ఉపేంద్ర, ఆర్‌ఐ సీతయ్య, కార్యదర్శి రామకృష్ణ, నలబోలు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు అండగా ప్రభుత్వం

కోదాడ : బీఆర్‌ఎస్ ప్రభుత్వం వికలాంగులను అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. అలింకో సంస్థ ద్వారా వికలాంగులకు బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్ల పంపిణీకి గాను సోమవారం పట్టణ పరిధిలోని మేళ్లచెరువు కాశీనాథం ఫంక్షన్ హాల్‌లో లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీలు కవిత, జ్యోతి, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంపటి పద్మ తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తులకు ప్రభుత్వం పెద్దపీట

తెలంగాణ ప్రభుత్వం కుల వృత్తులకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్ప దేవాలయం వెనుక రూ.2 కోట్లతో చేపట్టిన దోబీఘాట్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు.

ప్రజల మద్దతుతో ఎన్నికల బరిలో ఉంటున్నా

- ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు

హుజూర్‌నగర్ : నియోజకవర్గ ప్రజల మద్దతుతో అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉంటున్నానని ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిస్వార్థంతో రాజకీయాల్లోకి వచ్చానని, అదేవిధంగా రాజకీయాలు చేయాలనుకుంటున్నానని చెప్పారు. నల్లగొండ పార్లమెంట్ సెగ్మెంట్‌లో ఒక బీసీ అభ్యర్థిగా కాంగ్రెస్ తరఫున పోటీ చేయాలని గాంధీభవన్‌లో దరఖాస్తు చేశానని చెప్పారు. కాంగ్రెస్ టికెట్ ఇస్తే కాంగ్రెస్ అభ్యర్థిగా, లేదంటే ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తానని చెప్పారు. ఇప్పటికే ఓజో ఫౌండేషన్ ద్వారా నిరుద్యోగులకు ఉచిత కోచింగ్ ఇప్పించామని వారిలో ముగ్గురు ఎస్ఐలుగా, 40 మంది కానిస్టేబుళ్లుగా రాబోతున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రార్థన మందిరాలు, ఆలయాలకు మరమ్మతులు, నిర్మాణాలు, పాఠశాలల మరమ్మతులు, సొంత డబ్బుతో పేదలకు సహకారాలు అందించానని చెప్పారు. పదవి ఉన్నా లేకున్నా రాజకీయాలకతీతంగా ప్రజాసేవ చేస్తానన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల మద్దతుతో గెలవబోతున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ఫౌండేషన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుక్కల వెంకన్న, కాకునూరి శివారెడ్డి, రచ్చమళ్ల సైదులు, బొమ్మకంటి సైదులు, శివ శంకర్, రసూల్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషిచేస్తా



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జయబాబు

నేరేడుచర్ల : మున్సిపాలిటీ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023– 24 సంవత్సరానికి గాను 83 మున్సిపల్ సాధారణ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్య పనులకు ప్రత్యేక నిధులు కేటాయించినట్లు తెలిపారు. మున్సిపాలిటీలో పనిచేసే సిబ్బందికి జీతభత్యాల పెంపునకు సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ బి.శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ అశోక్‌రెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, నాగయ్య, బాషా, శహనాజ్, అలక సరిత, సాయి, కొదమగుండ్ల సరిత, సుగుణ, ప్రకాశ్, నాగవేణి, సులోచన తదితరులు ఉన్నారు.

మున్సిపల్ నిధులు దుర్వినియోగం

- కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆరోపణ

నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపాలిటీ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొణతం చిన వెంకట్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీకి మంజూరైన నిధులను మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం లేకుండానే కమీషన్లకు కక్కుర్తి పడి పనులు చేపడుతున్నారని ఆరోపించారు. హరిహాతరం పేరిట రూ.31 లక్షలు కేటాయించి దుర్వినియోగానికి పాల్పడ్డారన్నారు. ప్రతి సంవత్సరం హారితహారం పేరిట నాటుతున్న మొక్కలను సంరక్షించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఇటీవల సీఎం కేసీఆర్ కేటాయించిన రూ.25 కోట్ల నిధులను మున్సిపల్ తీర్మానం మేరకు అభివృద్ధి పనులకు వినియోగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు ప్రకాశ్, నాగయ్య, సరిత తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పానుగోడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గరిడేపల్లి : గరిడేపల్లి మండలం పానుగోడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1980–81 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం సోమవారం నంగా నిర్వహించారు. ఆనాటి గురువులు అంకటి అప్పయ్య, అలుగుబెల్లి కృష్ణారెడ్డిలను ఘనంగా సత్కరించారు. అనంతరం ఇటీవల 75 వసంతాల వజ్రోత్సవాల కమిటీకి ఎన్నికైన ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షులు గన్న లింగయ్య, ఉపాధ్యక్షులు బిల్లా కనకయ్యలను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు అంకటి అప్పయ్య వజ్రోత్సవాల నిర్వహణ కోసం తమ వంతుగా 10వేల రూపాయలను విరాళాలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కట్ట శ్రీను, పూర్వ విద్యార్థులు బండ వెంటనర్సిరెడ్డి, గోపి, చింతకుంట్ల కృష్ణారెడ్డి, ఎడ్ల సుధాకర్ రెడ్డి, వెంకటరెడ్డి, లక్ష్మి, ధనమ్మ, సావిత్రి, ఉపేందర్, శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వర్లు, పశ్య రామిరెడ్డి, రాఘవయ్య, వెంకట్‌రెడ్డి, వీరబాబు తదితరులున్నారు.

సాగునీరు విడుదల చేయాలని రాస్తారోకో



నేరేడుచర్లలో జడ్చర్ల- కోదాడ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

నేరేడుచర్ల : నాగార్జునసాగర్ ఎడమ కాలువకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నేరేడుచర్లలో జడ్చర్ల– కోదాడ రహదారిపై బక్కయ్యగూడెం, మేడారం, పత్తేపురం, వైకుంఠాపురం, జానలదిన్న గ్రామల రైతులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయకట్టు పరిధిలోని బోర్లు, బావుల కింద కొద్ది పాటి పంట పొలాలను సాగు చేస్తే భూగర్భ జలాలు ఎండిపోయి నీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఎడమ కాలువకు సాగు నీటిని విడుదల చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకొని రైతులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఎడమకాలువకు నీటిని విడుదల చేయాలి



ఎండిపోయిన వరిపొలాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

మునగాల : సాగర్ ఆయకట్టులో నీరు లేక వరిపొలాలు ఎండిపోతున్నాయని, తక్షణమే అధికారులు సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవరం వెంకటరెడ్డి కోరారు. సోమవారం మండల పరిధిలో ఎండిపోయిన వరిపొలాలను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం ఎడమకాలువకు నీటిని విడుదల చేయకోవడంతో రూ.లక్షలు వెచ్చించి బోర్లు, బావులు ఏర్పాటు చేసుకొని రైతులు వరిసాగు చేశారని, కానీ వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు తగ్గిపోయి సరిపడ సాగునీరు అందడం లేదన్నారు. గతంలో సాగర్ ప్రాజెక్టులో 480 అడుగుల నీటిమట్టం ఉన్నప్పుడు ఎడమకాలువకు తాగునీరు విడుదల చేసి చెరువులు, కుంటలు నింపిన ప్రభుత్వం ప్రస్తుతం 518 అడుగుల నీరు ఉన్నా నీటిని ఎందుకు విడుదల చేయడం లేదో అర్థం కావడం లేదన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి గడ్డం వినోద్, రైతులు వేట శివాజీ, వేట అశోక్, ఉప్పుల సీతారెడ్డి, ఉప్పుల కృష్ణారెడ్డి, గడ్డం గురుమూర్తి, శంకర్, శేషు, శ్రీను పాల్గొన్నారు.

వట్టె జానయ్యపై కక్ష సాధింపు తగదు

నడిగూడెం : బీఆర్‌ఎస్ నాయకుడు వట్టె జానయ్యపై మంత్రి జగదీశ్‌రెడ్డి కక్ష సాధింపు తగదని యాదవ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బడుగుల నాగార్జున్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగదీశ్‌రెడ్డి గెలుపు కోసం జానయ్య అహర్నిశలు కృషి చేశారని, ఎమ్మెల్యే టికెట్ అడిగినందుకు అతనిపై అక్రమ కేసులు బనాయించడం సరికాదన్నారు.

వట్టె జానయ్యపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

హుజూర్‌నగర్ : డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యపై అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని యాదవ సంఘం జిల్లా నాయకుడు యల్లావుల రమేష్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జానయ్యపై గత పదేళ్లగా పెట్టని కేసులు ఇప్పుడు పెట్టడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సంఘం నాయకులు యల్లావుల రాము, జడ శ్రీనివాస్, పి.అశోక్, జె.శ్రీనివాస్, జి.వెంకన్న, జె.లింగయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడలు ప్రారంభం

మేళ్లచెరువు : మండల కేంద్రంలో మండల స్థాయి క్రీడలను సోమవారం ఎంఈఓ సైదానాయక్, తహసీల్దార్ జ్యోతి ప్రారంభించారు. పాఠశాలల విద్యార్థులకు అండర్ –14, అండర్ –17 బాలలు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలు నిర్వహించారు.సర్పంచ్ శంకర్‌రెడ్డి, హెచ్ఎం నారాపరెడ్డి ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

పాలకవీడు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను సోమవారం అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి చత్రునాయక్, ఎంపీటీసీ ఉపేందర్, ఎస్ఎంసీ చైర్మన్ జానీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బషీర్‌బాగ్ అమరుల త్యాగం వృథా కాదు



కోదాడ : అమరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కోదాడ : విద్యుత్ చార్జీల పెంపుపై 2000 సంవత్సరంలో జరిగిన ఉద్యమంలో నాటి తెలుగుదేశం ప్రభుత్వం జరిపిన కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన అమరుల త్యాగాలను వృథ కానివ్వమని సీపీఎం నాయకులు అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో అమరుల 23వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అమరుల చిత్రపటాలకు వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముత్యాలు, దాసరి శ్రీనివాస్, గంట నాగరాజు, సాయి, వీరయ్య, వెంకన్న, సత్యం, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో ఉద్యమిస్తాం

హుజూర్‌నగర్ : విద్యుత్ పోరాటంలో అమరులైన వారి త్యాగాల స్ఫూర్తితో ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాండు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని సీపీఎం కార్యాలయంలో విద్యుత్ పోరాటంలో బషీర్‌బాగ్‌లో అమరులైన వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పల్లె వెంకటరెడ్డి, దుగ్గి బ్రహ్మం, హుస్సేన్, యోనా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని దళితులకు కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మునగాల : మండలంలోని తాడువాయిలో సర్వే నెంబర్ 159లో గల ప్రభుత్వ భూమిని గ్రామంలోని దళితులకు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బుర్రి శ్రీరాములు, కోట గోపి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం వారు మండల కేంద్రంలోని తహసీల్దార్ అంజనేయులుకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రభుత్వ భూమిని కొందరు దళితులు ఏడు ఏళ్లుగా సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారని, ఆ భూమిని వారికి చెందకుండా చేయాలని కొందరు భూయజమానులు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపి పేదలకు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, జిల్లా సభ్యుడు మిట్టగడుపుల ముత్యాలు, ప్రజా సంఘాల నాయకులు మాతంగి పుల్లయ్య, జిల్లేపల్లి ముత్తయ్య, కోట పాపయ్య, జిల్లేపల్లి అచ్చులయ్య, మనోజ్, సాయికుమార్, నాగరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ పండుగ



బోనాలతో ఆలయానికి తరలివెళ్తున్న మహిళలు, సర్పంచ్ షేక్ సలీమా

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ముత్యాలమ్మ, కనకదుర్గమ్మ పండుగను గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ షేక్ సలీమారంజాన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

బీఎస్పీ సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా వినయ్

హుజూర్‌నగర్ : బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) సోషల్ మీడియా విభాగం నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మండలంలోని బూరుగడ్డకు చెందిన యరగాని వినయ్‌గౌడ్ నియమితులయ్యారు. సోమవారం హుజూర్‌నగర్‌లో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దేశగాని సాంబశివగౌడ్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. గతంలో ఇన్‌చార్జ్‌గా ఉన్న జి.వీరాంజనేయులును తొలగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు మంద రవి, జిల్లా మహిళా కోకన్వీనర్ వెంపటి నాగమణి, సయ్యద్ హుస్సేన్ తదితరుల పాల్గొన్నారు.

నకిలీ పురుగు మందులపై అప్రమత్తంగా ఉండాలి

హుజూర్‌నగర్ : నకిలీ పురుగు మందుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి స్వర్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో నకిలి పురుగు మందులు వస్తున్నాయని పలు పురుగు మందుల కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కావున రైతులు పురుగు మందుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని అనుమానం వస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు.

తక్కువ ఖర్చుతో అందమైన రాఖీలు తయారీ

చిలుకూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రాఫ్ట్ టీచర్‌గా పనిచేస్తున్న మల్లం ఝాన్సీరాణి విద్యార్థులతో కలిసి తక్కువ ఖర్చుతో అందమైన రాఖీలను తయారు చేయించారు. సోమవారం పాఠశాలలో రాఖీలను ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మునగాల : పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య సూచించారు. సోమవారం తాడువాయిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మండల పశువైద్యాధికారి భాస్కర్, సిబ్బంది, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

రాంరెడ్డికి సన్మానం



రాంరెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

హుజూర్‌నగర్ : టీటీడీ సభ్యుడిగా నియామకమైన హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డిని సోమవారం అతని ఇంటి వద్ద మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ కమిటీ మెంబర్ యరగాని నాగన్నగౌడ్, ఎంపీటీసీలు బాల్దురి సందీప్, పరమేష్, కాంగ్రెస్ నాయకులు బాచిమంచి గిరి బాబు, న్యాయవాది ఎస్ఎస్ఆర్, వాసుదేవరావు, శ్యాంసుందర్, పి.వెంకటరెడ్డి, పి.అంజిరెడ్డి, టి.శేఖర్ రెడ్డి, పి.పిచ్చమ్మ, డి.మల్లీశ్వరి, కె.అరవిందరెడ్డిలతో పాటు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే సైదిరెడ్డితోనే అభివృద్ధి సాధ్యం

హుజూర్‌నగర్ : ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డితోనే హుజూర్‌నగర్ అభివృద్ధి సాధ్యమైందని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ పట్టణ ముఖ్య కార్యకర్తలు, వార్డు కౌన్సిలర్లు, పార్టీ వార్డు, యూత్, మహిళా అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలో ఇరువురికి మంజూరైన రూ.54 వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, జక్కుల నాగేశ్వరరావు, అట్లూరి హరిబాబు, నర్సింగ్ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి పద్మ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంపీపీ

దురాజ్‌పల్లి (సూర్యాపేట): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న హుజూర్‌నగర్ ఎంపీడీఓ శాంతకుమారి, సీనియర్ అసిస్టెంట్ చంద్రకళపై చర్యలు తీసుకోవాలని హుజూర్‌నగర్ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంపీడీఓ, సీనియర్ అసిస్టెంట్ కలిసి ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ ఉద్యోగులు విధులకు హాజరు కాకున్నా అయినట్లు హాజరు వేస్తూ వారినుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్‌కు పనిరాదని సాకు చూపుతూ అతని నుంచి ప్రతి నెలా రూ.10వేలు వసూలు చేస్తున్నారన్నారు. మండల పరిషత్ ఆమోద తీర్మానం లేకుండా తనకు ఇష్టం ఉన్న వారికి పనులను కట్టబెడుతూ కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు.